'ఆపరేషన్ సిందూర్'పై వ్యాఖ్యలు.. పాక్ నటీనటులపై బ్యాన్!

మిగతాది 8లో

తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY

సంపుటి : 23 సంచిక : 143 | శుక్రవారం మే 09 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | వెల-5

ఇదండీ..కబురు..




# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు

## హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిందే



- » హైడ్రా కేవలం కూల్చడానికి కాదు, ఆక్రమణదారులను అడ్డుకోవడానికే ఏర్పాటైనదని స్పష్టం.
- » పేదల ఇళ్లపై కూల్చివేతలు అన్న ఆరోపణలు తప్పుబట్టారు.
- » చెరువులను ఆక్రమించిన వాళ్లు ఎంతటి వారైనా వదలమంటూ హెచ్చరిక.
- » 461 చెరువులు కబ్జాలో ఉన్నాయని, 960 చెరువులలో ఎక్కువ భాగం ఆక్రమణలోనే ఉన్నదని వెల్లడి.
- » నాలాల ఆక్రమణ వల్లే రోడ్లపై నీరు నిలుస్తోందని వ్యాఖ్య.
- » లేక్‌వ్యూల పేరుతో చెరువుల్లో విల్లు నిర్మాణాలు తప్పుబట్టారు.
- » హైడ్రా అంటే భయం ఆక్రమణదారులకే అని వ్యాఖ్య.

**కబురు న్యూస్,హైదరాబాద్,మే 08:**
హైడ్రా అంటే కొందరికి కడుపు మంట అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే హైడ్రాపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా అనేది పేదల ఇళ్లు కూల్చడానికి కాదని.. ఆక్రణదారులను అడ్డుకోవడానికేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మన పూర్వీకులు ఇచ్చిన చెరువులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. చెరువులు కనుమరుగైతే మన మనుగడ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్‌ను కాపాడుకునేందుకు.. హైడ్రా ఉపయోగపడుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో తొలి హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువులను ఆక్రమించిన వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరేమనుకున్నా కూల్చివేతల విషయంలో మాత్రం హైడ్రా వెనక్కి తగ్గేది లేదని తెలిపారు. వర్షం వస్తే చెన్నై, ముంబై మహానగరాల పరిస్థితి ఏంటో చూస్తున్నామని ఆయన సోదాహరణగా వివరించారు. కాలుష్యంతో ఢిల్లీ విలవిల్లాడుతోంది.. ఈ పరిస్థితికి మానవ తప్పిదాలే కారణమని ఆయన పేర్కొన్నారు. మంచి పరిపాలన అందించేందుకు గడిచిన 76 ఏళ్లలో.. రాజ్యాంగాన్ని 100 సార్లకుపైగా సవరించుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గుర్తు చేశారు. నగరాభివృద్ధి కోసం గత సీఎంలు ఎన్నో చట్టాలు చేశారన్నారు. 1908లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు చూసి.. అప్పటి నిజాం నవాబు కన్నీరు సైతం పెట్టు-కున్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అనంతరం హైడ్రా పోలీస్ స్టేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే 122 హైడ్రా వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా తొమ్మిదిన్నర నెలల్లో ప్రజలకు మరింత చేరువైందన్నారు.

మిగతాది 2లో



## మందుపాతర పేలి ముగ్గురు పోలీసులు మృతి?

2లో

**కబురు న్యూస్,ములుగు,మే 08:**
తెలంగాణలోని ములుగు జిల్లా వాజేడులో మందుపాతర పేలుడు సంభవించింది. మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు పోలీసులు మృతిచెందగా పలువురికి గాయాలు అయినట్లు సమాచారం. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం పోలీసులు కూంబింగ్ చేస్తుండగా మందుపాతర పేలినట్లు తెలిసింది.

## 'ఆపరేషన్ సిందూర్'పై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు



**కబురు న్యూస్,హైదరాబాద్,మే 08:**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పై దుష్ప్రచారం చేసే వారికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. ఆపరేషన్ సిందూర్‌పై నకిలీ వార్తలు, తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసినా.. పోస్టులు పెట్టినా చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. సోషల్ మీడియాను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. అలాంటి సందేశాలు షేర్ చేసిన వారి వివరాలను 8712672222 నంబర్ వాట్సప్ ద్వారా పంపించవచ్చని సూచించింది.



## మెడికల్ కాలేజ్ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

- » వైద్య సేవల కోసం భారీగా నిధుల వెచ్చింపు
- » ఖమ్మంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన
- » పాల్గొన్న నలుగురు మంత్రులు

**కబురు న్యూస్,ఖమ్మం,మే 08:**
ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని,ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు- ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు- ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు.

2లో..



## సుందరీమణులు సిద్ధం..

- » రేపట్నుంచే హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు
- » గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభ కార్యక్రమం
- » పోటీలకు బందోబస్తు సహా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసిన ప్రభుత్వం
- » ఇప్పటికే నగరానికి చేరుకున్న 100 మందికి పైగా అందగత్తెలు

**కబురు న్యూస్,హైదరాబాద్,మే 08:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలకు సమయం ఆసన్నమైంది. శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియంలో అంగరంగ వైభవంగా ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. మిస్ వరల్డ్ సంస్థతో కలిసి ప్రభుత్వం.. ఈ పోటీలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పోటీల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ పటంపై ప్రత్యేక స్థానం పొందుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.


2లో




## పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే: లారీ క్లీనర్ కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం

**కబురు న్యూస్,నల్లగొండ,మే 08:**
సాధించాలనే పట్టుదల ఉంటే ప్రతి ఒక్కరికి అసాధ్యమైంది ఏమీ ఉండదనినే నిరూపించాడు నల్లగొండకు చెందిన బాసాని రాకేష్. పేద కుటుంబంలో పుట్టి.. ఎన్నో అవాంతరాలు, కష్టాలు, సవాళ్లు ఎదుర్కొని చివరకు గవర్నమెంట్ కొలువు సాధించాడు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుకు ఎంపిక కాగా.. గురువారం (మే 8) సచివాలయంలో అధికారుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. నల్లగొండ జిల్లా అశోక్ నగర్ కు చెందిన బాసాని రాకేష్ ది మిడిల్ క్లాస్ ఫ్యామిలీ. రాకేష్ తండ్రి లారీ క్లీనర్. కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకున్న రాకేష్ చిన్నప్పటి నుంచి కష్టపడి చదివేవాడు.

2లో







మిగతాది 2లో

## జమ్మూపై పాక్ డ్రోన్లతో దాడి..

## తిప్పికొట్టిన భారత్

జమ్మూ ఎయిర్‌పోర్ట్ టార్గెట్‌గా పాక్ డ్రోన్లతో దాడి చేసింది. ఎఫ్-16ను పాక్ ఆర్మీ ప్రయోగించింది. భారత్ బలగాలు ధీటుగా ఎదుర్కొన్నాయి. 10 పాక్ డ్రోన్లను భారత్ కూల్చివేసింది. సైరన్లతో ప్రజలను ఆర్మీ అప్రమత్తం చేసింది. సరిహద్దుకు 50 కిలోమీటర్ల దూరంలో రాకపోకలు బంద్ చేశారు. ప్రజలందరూ ఇళ్లలోనే ఉండాలని సైన్యం హెచ్చరించింది. జమ్మూ నగరమంతా విద్యుత్‌ను నిలిపివేశారు. పాక్ దాడులను భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది.జమ్మూ వ్యాప్తంగా సైరన్లు మోగుతున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో ఇంటర్‌నెట్ సేవలు కూడా నిలిపివేశారు. సాంబ సెక్టార్‌లో పాక్ కాల్పులకు తెగబడింది. ఎస్-400 సిస్టమ్‌తో పాక్ మిస్సైళ్లను భారత్ ధ్వంసం చేసింది. సరిహద్దులు దాటి భారత్‌లోకి ప్రవేశించిన ఎఫ్-16, రెండు జేఎఫ్-17లను కూల్చివేసిన ఇండియన్ ఆర్మీ.. పాక్‌ను మరో చావు దెబ్బ కొట్టింది. మూడు ఫైటర్ జెట్లను భారత్ సైన్యం కూల్చివేసింది.జమ్మూ, సివిల్ ఎయిర్‌పోర్ట్, సాంబ, ఆర్ఎస్‌పుర, చానీ మహిత్, అర్నియా ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులకు పాల్పడింది. పఠాన్ కోట్ ఎయిర్‌బేస్‌పై ఎఫ్-16 దాడికి ప్రయత్నించింది.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

# సుందరీమణులు సిద్ధం..

మొదటిపేజీ తరువాయి
విదేశీ ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించడం ద్వారా రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచ దేశాల సుందరీమణులతో పాటు అంతర్జాతీయ మీడియా సైతం రానుండటంతో రాష్ట్ర రాజధాని నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దింది. పటిష్ఠ భద్రత సహా అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తి అయినట్లు అధికరావర్గాలు వెల్లడించాయి.

**పలు దఫాలుగా సీఎం సమీక్షలు**

రాష్ట్ర ప్రతిష్టను పెంచేందుకు, పెట్టుబడుల ఆకర్షణకు అందాల పోటీలను వినియోగించుకోవాలని భావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇప్పటికే పలు దఫాలుగా సమీ క్షలు నిర్వహించారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లను సమీక్షించడంతో పాటు, కార్యక్రమా లు జరిగే ప్రదేశాలను కూడా సందర్శించారు. కంటెస్టెంట్లతోనూ ఒకసారి భేటీ అయ్యారు. పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు.

అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రకృతి, పర్యా వరణ పరంగా అన్ని హంగులు ఉన్నా, తెలంగాణ ఆ రంగంలో వెనుకబడిందని భావిస్తున్న ప్రభుత్వం.. ఇకపై 'తెలంగాణ జరూర్ ఆనా'(తప్పకుండా తెలంగాణ రండి) అనే నినాదాన్ని ప్రపంచవ్యాప్తం చేయా లని నిర్ణయించింది. తద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో పాటు పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావిస్తోంది.

**సర్వాంగ సుందరంగా నగరం**

ఈ పోటీల్లో పాల్గొనడానికి దాదాపు 100 మందికి పైగా సుందరీమణులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. నిర్వహణ సంస్థ మిస్ వరల్డ్ లిమిటెడ్‌కు చెందిన 28 మంది ప్రతినిధులు, మరో 17 మంది సహాయకులు కూడా వచ్చేశారు. రానున్న రెండురోజుల్లో మరికొంత మంది ప్రతినిధులు వివిధ దేశాల నుంచి వస్తారని నిర్వాహకులు తెలిపారు. అధికారులు నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా.. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విమానాశ్రయాల్లో కూడా ప్రపంచ సుందరి పోటీలకు వచ్చే వారికి ఆహ్వానం పలుకుతూ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయించింది.

గత వారం రోజులుగా వస్తున్న అతిథులు అందరికీ తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా స్వాగతం పలుకుతున్న పర్యాటక శాఖ, వారి బసకు అవసరమైన ఏర్పాట్లను కూడా చేసింది. విదేశీ ప్రతినిధులు బస చేసిన ట్రైడెంట్ హోటల్ దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

**అలరించిన రిహార్సల్స్**

ప్రపంచ సుందరి పోటీల కోసం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గురువారం రిహార్సల్స్ ఉత్సాహంగా కొనసాగాయి. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న వివిధ దేశాల పోటీదారులు ఆకర్షణీయమైన వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. తమ ప్రతిభకు తగిన కార్యక్రమాలను ఎంపిక చేసుకుని ప్రాక్టీస్ చేశారు. ఇక సమయాను కూలంగా స్టేజ్ ఎంట్రీలు, గ్రూప్ మూవ్‌మెంట్స్, లైటింగ్, మ్యూజిక్ సెట్ అప్ తదితర అంశాలను నిర్వాహకులు పరిశీలించారు. ప్రధాన కార్యక్రమానికి ముందస్తుగా ప్రతి అంశాన్ని శ్రద్ధగా పరిశీలిస్తూ రిహార్సల్స్ పూర్తిచేశారు.

**సామాన్యులకూ వీక్షించే చాన్స్**

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెలా ఖరు వరకు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని పరిమిత సంఖ్యలో సామాన్యులకూ కల్పించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టూరిజం వెబ్‌సైట్ ( https://tourism.telangana.gov. in/events&single/miss& world& event)లో రిజిస్టర్ చేసుకున్న వారికి పోటీలు జరిగే ఒక్కో కేంద్రంలో వెయ్యి మంది చొప్పున మొత్తం 5 కేంద్రాల్లో 5వేల మందికి మిస్ వరల్డ్ పోటీలను వీక్షించే అవకాశం కల్పించాలని భావిస్తున్నారు.

## సంపాదకీయం

# అదనుచూసి పదునైన పాఠం!




తీరికూర్చుని భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాలమారి పాకిస్తాన్‌కూ, దాని కీలుబొమ్మలైన ఉగ్రమూకలకూ తెలిసొచ్చి ఉండాలి. 2016 నాటి 'ఉరి' సర్జికల్ దాడులు, 2019 నాటి బాలాకోట్ వైమానిక దాడులకు అనేక రెట్లు అధికంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో మన త్రివిధ దళాలు పకడ్బందీ సమన్వయంతో పాకిస్తాన్‌లోనూ, ఆక్రమిత కశ్మీర్ లోనూ తొమ్మిది చోట్ల గంటసేపు సాగించిన క్షిపణి దాడులు పాక్ సైన్యాన్నీ, ఉగ్రమూకల్నీ గుక్క తిప్పుకోనీయకుండా చేశాయి. ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలూ, వారి ఆయుధ గిడ్డంగులూ, ఇతరేతర అవసరాలకు వినియోగిస్తున్న బహుళ అంతస్తుల భవంతులూ లక్ష్యంగా మొత్తం 24 చోట్ల సాగించిన దాడుల్లో 70 మంది వరకూ ఉగ్రవాదులు మరణించగా, మరో 60 మంది గాయపడ్డారని చెబు తున్నారు. ఉగ్రవాద ముఠాలైన జైషే మొహమ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా(ఎల్‌ఈటీ) ప్రధాన కార్యాలయాలు రెండూ కుప్పకూలాయని సమాచారం. జేఈఎం చీఫ్ మసూర్ అజర్ సోదరితోసహా అతగాడి కుటుంబానికి చెందిన పదిమంది హతమయ్యారని కూడా చెబుతున్నారు. జరిగిన నష్టాన్ని కప్పెట్టే ఎత్తుగడతో అయిదు భారత్ విమానాలను కూల్చామంటూ పాక్ స్వోత్కర్షలకు పోతోంది. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి పాక్ లోలోపలివరకూ చొచ్చుకెళ్లి దాడులు సాగించిన తీరూ, ఒక్క క్షిపణి కూడా గురితప్పకుండా శత్రుమూకలపై చంద్రనిప్పులు కురిపించిన విధానం మన త్రివిధ దళాల పకడ్బందీ అంచనాలకూ, పదునైన వ్యూహచతురతకూ దర్పణాలు. పాక్ గడ్డపై గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఉగ్రశిబిరాల ఆనుపానుల్ని శత్రునేత్రానికి చిక్కని విధంగా గత పక్షం రోజులుగా మానవ రహిత విమానాలతో జల్లెడపట్టాకే ఈ దాడులు జరిగాయి. పహల్‌గామ్ సమీపంలో అకారణంగా, అన్యాయంగా నిరాయుధ భారత పౌరులను గురిచూసి కాల్చిచంపటానికి కిరాయిమూకల్ని పంపి కొన్నిరోజులుగా పాకిస్తాన్ మురుస్తోంది. దీనిపై నిలదీస్తే షరా మామూ లుగా సాక్ష్యాలడుగుతోంది. గత నెల 22న పహల్‌గామ్ సమీపంలో ఉగ్రవాద ముఠా 26 మందిని పొట్టనబెట్టుకున్నప్పటి నుంచీ భారత ప్రజ ప్రతీకారంతో రగిలిపోతోంది. కంటికి కన్ను సిద్ధాంతం పాటించి గట్టి దెబ్బతీయాల్సిందేనన్న అభిప్రాయం అలుముకుంది. ఈ నేపథ్యంలో మన దళాల దాడులు విజయవంతం కావటం అందరినీ సాంత్వన పరుస్తుందనటంలో సందేహం లేదు. అనుకోని పరిణామాలు తలెత్తితే అనుసరించాల్సిన పద్ధతులపై పౌరులకు అవగాహన కల్పించటానికి బుధవారం మాక్ డ్రిల్ జరగటం, అంతకుముందు రోజు రాత్రే మన త్రివిధ దళాలు దాడులు చేయటం గమనిస్తే వర్తమానం ఎంత జటిలంగా ఉన్నదో అర్థమవుతుంది. ఇది మనం కోరుకున్నది కాదు. మన ప్రమేయం లేకుండా వచ్చిపడిన విపత్తు. అకారణంగా మనపై రుద్దిన సంక్లిష్ట సమస్య. దీనికి దీటుగా స్పందించకపోతే ఉగ్రదాడులకు అంతూ పొంతూ ఉండదు. కనుకనే పహల్‌గామ్ మారణకాండ గురించి తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ పర్యటనను రద్దుచేసుకుని వెను దిరిగారు. ఆ వెంటనే మంత్రివర్గ సహచరులతో, త్రివిధ దళాల అధిపతులతో వరస సమాలోచనలు సాగించారు. ఎప్పుడు, ఎక్కడ ఎలా దాడులు సాగించాలో, తీవ్రత ఏ స్థాయిలో వుండాలో మీరే నిర్ణ యించండంటూ మన దళాలకు అధికారం ఇచ్చారు. పర్యవసానంగానే పాక్ ప్రాపకంతో చెలరేగి పోతున్న ఉగ్రముఠాలకు గట్టి సమాధానం వెళ్లింది. ఈ దాడులకు చాలాముందే ఇతరేతర నిర్ణ యాలు తీసుకున్నారు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ప్రకటించ టంతోపాటు ఇండియా పలు చర్యలు తీసుకుంది. దీన్నంతటినీ గమనిస్తున్నవారికి మన దేశం సైనిక చర్యకు కూడా వెనకాడబోదని పక్షం రోజుల క్రితమే అర్థమైంది. యుద్ధం దేనికీ పరిష్కారం కాకపోవచ్చు. చర్చలే అంతిమంగా ఎంతటి జటిల సమస్యనైనా పరిష్కరిస్తాయన్న సిద్ధాంతం కూడా సరైనదే కావొచ్చు. కానీ పొరుగు పచ్చగావుంటే ఓర్వలేక నిష్కారణంగా దాడులకు దిగే నైజాన్ని శాంతిప్రవచనాలతో ఎదుర్కొనటం సాధ్యమేనా? ఒకపక్క పహల్‌గామ్ దాడులతో సంబంధం లేదంటూనే గత కొన్ని రోజులుగా అధీనరేఖ వద్దా, అంత ర్జాతీయ సరిహద్దు వద్దా పాక్ ఎలాంటి కవ్వింపూ లేకుండా కాల్పులకు దిగుతోంది. ఈ దాడుల కారణంగా ఒక్క బుధవారంనాడే పూంఛ్ జిల్లా గ్రామాల్లో 12 మంది పౌరులు బలయ్యారు. తన దుష్ట పన్నాగాలను కప్పిపుచ్చటానికి భద్రతామండలిలో పాకిస్తాన్ అమాయకత్వం నటిస్తూ భారత్ తీసు కుంటున్న వరస చర్యలకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని విఫలయత్నం చేసింది. రేపో మాపో అది నేరుగా సైన్యాన్ని రంగంలోకి దించి ప్రతీకారం పేరిట చెలరేగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉగ్రముఠాల ద్వారా మారణహోమానికి పాల్పడటం కన్నా ఒకరకంగా ఇది మంచిదే. భారత్ బెదిరిపోయి సైనిక దాడుల ఆలోచన మానుకుంటుందన్న తప్పుడు ఆలోచనతో కొన్ని రోజులుగా అది అణుబాంబు బెదిరింపులకు కూడా తెగించింది. ఆ దుస్సాహసానికి పూనుకుంటే చేజేతులా స్వీయవినాశనాన్ని కొనితెచ్చుకున్నానని పాక్ పశ్చాత్తాపపడే రోజు ఎంతో దూరంలో ఉండదు. ఈ కష్టకాలంలో దేశ ప్రజానీకం కుల మత భేదాలు మరిచి కలిసికట్టుగా ఉండటం అత్య వసరం. ఇదే అదనుగా నాలుగు ఓట్ల కోసమో, మరికొన్ని సీట్ల కోసమో ప్రజల్లో వైషమ్యాలు సృష్టించాలని చూసే అవాంఛనీయ శక్తుల్ని అందరూ సకాలంలో పోల్చుకుని దూరం పెట్టడం, తగిన బుద్ధి చెప్పటం ఎంతో అవసరం. మనలోని సమష్టితత్వమే ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనే ధైర్యాన్ని స్తుంది. విజయాన్ని మన చేతికందిస్తుంది.

# మందుపాతర పేలి ముగ్గురు పోలీసులు మృతి?

మొదటిపేజీ తరువాయి
అయితే ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు ధ్రువీకరించలేదు. ఆపరేషన్ కర్రెగుట్ట పేరుతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అటవీ ప్రాంతాన్ని పోలీసులు, కేంద్ర బలగాలు జల్లెడపడుతూ తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం రోజువారీ కూంబింగ్ కోసం వెళ్లిన సమయంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో ముగ్గురు పోలీసులు మృతి చెందినట్లు సమాచారం.

# మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై విద్య, వైద్య ఆరోగ్యశాఖ శాఖలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిన అన్నిటినీ క్లియర్ చేస్తున్నామన్నారు. విద్య వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మా అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ. 130 కోట్లతో ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆరోగ్యశాఖ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు- చేస్తున్నామన్నారు. 16 నెలల పాలనలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ- వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తర్వలోనే ఖమ్మంకు ఆర్గాన్ రిట్రీ-వర్ సెంటర్ ఏర్పాటు- చేస్తున్నామని, వరంగల్‌లో రూ. 39 కోట్లతో రీజీనల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు-చేస్తామని తెలిపారు. అలాగే ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు- చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరిక మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు- చేస్తున్నామని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మిడ్ వైఫరీ కోర్స్‌లు విద్యార్థులకు అందుబాటు-లో ఉంచబోతున్నామని, పేద వారికి వైద్యం అందుబాటు-లో ఉండాలని మంత్రి దామోదర అభిప్రాయం వ్యక్తం చేశారు.

# జమ్మూపై పాక్ డ్రోన్లతో దాడి.. తిప్పికొట్టిన భారత్

మొదటిపేజీ తరువాయి
పాక్ దాడులతో ఎలాంటి నష్టం జరగలేదని భారత్ ఆర్మీ ప్రకటించింది. పాక్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టామని పేర్కొంది. కాగా, పాక్ గగనతల రక్షణ వ్యవస్థలపై భారత సైన్యం ఇవాళ విరుచుకుపడిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ మిస్సైళ్లను భారత దళాలు కూల్చివేశాయి. యాంటి మిస్సైల్ సిస్టమ్ ద్వారా పాకిస్థాన్ మిస్సైళ్లను గాల్లోనే భారత్ పేల్చేసింది. ఎస్-400 మిస్సైళ్లను ఉపయోగించి పాక్‌కు భారత్ బుద్ధి చెప్పింది. గత రెండు రోజులుగా భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లతో దాడులకు పాకిస్థాన్ యత్నిస్తుండగా, వీటిని భారత రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకుంటున్నాయి.

# పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే: లారీ క్లీనర్ కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం

మొదటిపేజీ తరువాయి
పీజీ కంప్లీట్ చేసి ప్రస్తుతం గురుకులలో పార్ట్ టైం టీజీటీ ఫిజికల్ సైన్స్ టీచర్ గా పని చేస్తున్నాడు. ఓ వైపు జాబ్ చేసుకుంటూనే మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యాడు. ఈ క్రమంలోనే ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్ష రాశాడు. అద్భుతంగా పరీక్ష రాసిన రాకేష్ 203 మార్కులు సాధించి జాబ్ కొట్టాడు. 203 మార్కులతో స్టేట్ 62, జోనల్ స్థాయిలో 18 ర్యాంక్ సాధించాడు. గురువారం (మే 8) సచివాలయంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాకేష్ అధికారుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. రాకేష్ ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు

మొదటిపేజీ తరువాయి
ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖకు సంబంధించిన అధికారాలు.. హైడ్రా పోలీస్ స్టేషన్ ద్వారా కల్పించారన్నారు. వివిధ సందర్భాల్లో ఈ అధికారాలు తమకు ఉపయోగపడతాయని తెలిపారు. సీఎం ఏ ఉద్దేశ్యంతో హైడ్రాను ప్రారంభించారో.. అదే ఉద్దేశ్యంతో ఈ సంస్థ పని చేస్తుందని వివరించారు. సామాజిక బాధ్యతతో హైడ్రా ముందుకు వెళ్తుందని చెప్పారు. అసెస్ట్ ప్రొటెక్షన్ మాత్రమే కాకుండా.. డిజాస్టర్ రెస్పాండ్స్ కూడా సరైన అధికారులతో హైడ్రా పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం కూడా పెద్ద ఎత్తులో వాడుతూ ఎఫ్‌టీ-ఎల్ పరిధి గుర్తిస్తున్నామన్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు- ద్వారా ల్యాండ్ గ్రేబింగ్, చీటింగ్, ఫోర్జరీ చేసే వారిపై చర్యలు తీసుకోనే అవకాశం దక్కిందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు హైడ్రా ఇలాగే ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ జి. విజయలక్ష్మితోపాటు- పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పూర్తిస్థాయి యుద్ధం వస్తే భారత్‌దే విజయం అమెరికన్ మాజీ పైలట్ డేల్ స్టార్క్ వ్యాఖ్యలు

పాక్‌తో యుద్ధంలో భారత్‌దే విజయం అంటూ అమెరికా ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఓ మాజీ పైలట్ నెట్టింట పెట్టిన పోస్టు ప్రస్తుతం వైరల్ అవుతోంది. డేల్ స్టార్క్ అనే మాజీ పైలట్ గురువారం ఈ పోస్టు నెట్టింట పంచుకున్నారు. భారత్ గెలుపుపై తన మొత్తం డబ్బును పందెం కాసేందుకు సిద్ధమేనని అన్నారు. పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన భారత్ పాక్‌లోని ఉగ్రస్థావరాలను కచ్చితమైన మిసైల్ దాడులతో ధ్వంసం చేసింది. అయినా బుద్ధి తెచ్చుకోని పాక్ ప్రస్తుతం సరిహద్దు వెంబడి కవ్వింపు చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో పరిస్థితులు ముదిరితే ఎలా అన్న చర్చ మొదలైంది. ఈ విషయంపై డేల్ స్టార్క్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారత్, పాక్ పైలట్లు- ఇద్దరితోనూ నేను గతంలో కలిసి పనిచేశా. ఈ పరిస్థితి ముదిరితే మాత్రం భారత్‌కే విజయం దక్కుతుందని నా అభిప్రాయం అని పేర్కొన్నారు. డేల్ కామెంట్స్‌కు పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పాక్ వద్ద అమెరికాకు చెందిన ఎఫ్-16, చైనాకు చెందిన జేఎఫ్-17 విమానాలు ఉంటే భారత్ వద్ద ఫ్రాన్స్‌కు చెందిన అత్యాధునిక రఫేల్ విమానాలు ఉన్నాయి. 4.5 తరం యుద్ధ విమానమైన రఫేల్.. భారత యుద్ధ విమానాల్లో అత్యాధునికమైనది. భారత ఉపఖండ పరిస్థితుల కోసం 13 ప్రత్యేక ఫీచర్లను కూడా రఫేల్‌కు జోడించారు. బియాండ్ విజువల్ రేంజ్ లక్ష్యాలను ధ్వంసం చేసే మెటియార్ మిసైల్స్, ఎల్రక్టానిక్ యుద్ధరీతులకు ఉద్దేశించిన సాధనాలు, గొప్ప సామర్థ్యం కలిగిన రాడార్, కమ్యూనికేషన్ వ్యవస్థలు ఈ విమానంలో ఉన్నాయి. ఫలితంగా యుద్ధ సమయాల్లో అత్యంత సమర్థవంతంగా ఈ విమానాలు తమ లక్ష్యాలను ధ్వంసం చేయగలవు. ఇక హామర్ బాంబ్స్, స్కాల్ప్ మిసైల్స్‌తో రఫేల్ యుద్ధ విమానాలు శత్రుదేశ మూలమూలాల ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేయగలవు. ఇక పాక్‌కు ఎఫ్-16లు విక్రయించేటప్పుడే అమెరికా ఎన్నో ఆంక్షలు విధించింది. భారత్‌పై ఈ విమానాలను వాడొద్దని స్పష్టం చేసింది. ఎఫ్-16ల వినియోగంపై వేయి కళ్లతో నిఘా పెట్టింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న పాక్‌కు ఎఫ్-16ల నిర్వహణ కష్టంగా మారింది. దీంతో, ఎఫ్-16 అన్ని అవసరాలకు వినియోగించుకోలేని పరిస్థితుల్లో పాక్ ఇరుక్కుపోయింది. జేఎఫ్ -17 యుద్ధ విమానాలు ఉన్నప్పటికీ వీటి సామర్థ్యం రఫేల్‌తో పోలిస్తే పరిమితమేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఆయుధాలు మోసుకెళ్లే సామర్థ్యం, యుద్ధసమయాల్లో శత్రువుల దాడుల నుంచి తప్పించుకోవడం, సుదూరాన లక్ష్యాలను ధ్వంసం చేసే సామర్థ్యంలో జేఎఫ్-17 రఫేల్‌తో పోలిస్తే వెనకబడే ఉంటోంది.

## పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు న్యాయం చేయాలి... షేక్ ఇంతియాజ్



**కబురు న్యూస్ మోస్రా మే 08**
బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు గత పది సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేసిన పార్టీ కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించి న్యాయం చేయాలని పార్టీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు షేక్ ఇంతియాజ్ అన్నారు. గురువారం ఇందిరమ్మ కమిటీలలో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన అనుచరులకు ఇందిరమ్మ కమిటీలలో చోటు కల్పించడం పట్ల యూత్ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి రోడ్డుపై నిలబడి నిరసన తెలియజేశారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వల్ల పాత కాంగ్రెస్ కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పార్టీ అధిష్టానం గుర్తించి పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సారెడ్డి, సాయిలు, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పోచయ్య, రాజశేఖర్ రెడ్డి, వినాయక రెడ్డి, రాములు, సమీర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వర మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి సోమలింగ శివాచార్య స్వామి



**కబురు న్యూస్ బాన్సువాడ మే 08**
బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాత్మా బసవేశ్వర మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి శుక్రవారం ముఖ్యఅతిథిగా బిచ్కుంద మఠాధిపతి సోమలింగ శివాచార్య మహాస్వామి సోమయప్ప విచ్చేసి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వీరశైవ లింగయ్య సభ్యులు దెగ్లూర్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బసవేశ్వర మహారాజ్ విగ్రహావిష్కరణకు లింగయత్ సభ్యులు, గ్రామస్తులు, సకాలంలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## పోగొట్టుకున్న ఐఫోన్ అందజేత...




**కబురు న్యూస్,బోధన్ మే 08..**
దొరికిన మొబైల్ ఫోన్ ను యజమానికి అప్పగించి మున్సిపల్ జవాన్ తన నిజాయితీని చాటుకున్నాడు. బోధన్ పట్టణంలో రోడ్డు పైన తనకు దొరికిన లక్ష రూపాయల ఐఫోన్ ను బోధన్ పట్టణ పోలీసుల ద్వారా గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో మొబైల్ యజమాని స్నేహిత్ కి మున్సిపాలిటీ లో పనిచేసే జవాన్ గాబ్రియేల్ అందించాడు. ఈ సందర్భంగా పలువురు గాబ్రియేల్ ను అభినందించారు. ఎస్ఐ భాస్కరా చారి, సిబ్బంది ఉన్నారు.

## మొబైల్ ఫోన్లు అప్పగింత...




**కబురు న్యూస్,బోధన్ మే08..**
బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను వాటి యజమానులకు అప్పగించారు. తమ ఫోన్లు పోగొట్టుకున్నామని 11మంది భాదితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి గురువారం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫోన్ల యజమానులకు అందజేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

## పెళ్లి కావడం లేదని జీవితాన్ని అర్ధాంతరంగా ముగించిన యువకుడు



**కబురు న్యూస్,రాజన్న సిరిసిల్ల మే08..**
పెళ్లి చేసుకోడానికి వధువు దొరకడం లేదన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా యెల్లారెడ్డిపేట మండలంలో ఈ ఘటన వెలుగుచూసింది. మే 7 బుధవారం 23 ఏళ్ల యువకుడు వధువు దొరకకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. బాధితుడిని గొర్రెల కాపరిగా పనిచేసే ఒగ్గు మహేష్‌గా గుర్తించారు. అందుతోన్న సమాచారం ప్రకారం మహేష్ చాలా సంవత్సరాలుగా తగిన వివాహ బంధం కోసం వెతుకుతున్నాడు. కానీ తనకు నచ్చిన వధువు దొరకలేదు. తన పరిస్థితిపై ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారని సమాచారం. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం గ్రామ శివార్లలోని ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్రభుత్వ విద్య సంస్థల్లో అడ్మిషన్ లు, ఫలితాలపై అడిషనల్ కలెక్టర్ సమీక్ష

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మే 08 :**
2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యా సంస్థలలో అడ్మిషన్లను భారీగా పెంచడానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు.గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం హాల్లో నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి అధ్యక్షతన జరిగిన సమన్వయ సమావేశంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ కళాశాలలు పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచడంతో పాటు, రానున్న సప్లమెంటరీ పరీక్షలలో 100% ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా లోని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లు, హెడ్మాస్టర్లు కృషి చేయాలని ఆదేశించారు.జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ,ఇంటర్ విద్య కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఈ సంవత్సరం ఫలితాలను అధిక శాతం సాధించేందుకు కృషి చేయడం జరిగిందని అన్నారు.ఫలితాల సాధనలో 90 రోజుల ప్రణాళికలను అమలు చేశామని అలాగే ప్రస్తుత సప్లిమెంటరీ పరీక్షలకు 15 రోజుల ప్రణాళిక ద్వారా 100%



ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ఇంటర్ విద్య అధికారి అన్నారు వచ్చే విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు డ్రైవ్ కొనసాగుతుందని తెలియజేశారు.అలాగే ప్రభుత్వ కళాశాలలలో చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులకు ప్రభుత్వ హాస్టలలో కనీసం 20 శాతం సీట్లను కేటాయించాలని కోరారు. కొన్ని గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్ సౌకర్యం లేదని,మారుమూల గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపినట్టు అయితే అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి అన్నారు.అలాగే సమావేశంలో కళాశాలలో ప్రభుత్వ గుర్తింపు లేని



కళాశాలు అఫ్లియేషన్ పొందాలని అన్నారు.కళాశాల భవనాలలో ఫైర్ సేఫ్టీ కోసం అవసరమైన ఏర్పాట్ల కోసం కృషి చేస్తున్నామని అన్నారు.ప్రభుత్వ అనుమతి లేని కళాశాలలో విద్యార్థులను చేర్పించవద్దని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్,ఆర్టీసీ అధికారులు ఫైర్ ఆఫీసర్,ఎస్సీ ఎస్టీ, బిసి, మైనారిటీ హాస్టల్ సంబంధిత అధికారులు,జిల్లా ఇంటర్ విద్య పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య,రజియుద్దీన్ అస్లాంలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ...



**కబురు న్యూస్,బోధన్ మే 08..**
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో జవాన్లకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. గురువారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా





జవాన్ లకు మద్దతుగా జాతీయ జండాలు చేత



పట్టుకుని సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినుద్దీన్, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, తూము శరత్ రెడ్డి, హనుమంతరావు, హరికాంత్ చారి, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారి నవీన్, మైనారిటీ సెల్ అధ్యక్షులు కలీం, రాములు చిన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన యూనిసెఫ్ బృందం క్షేత్ర పర్యటన

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మే 08 :**
ముగ్గురు సభ్యుల యూనిసెఫ్ బృందం డాక్టర్ ఖ్యాతి తివారి న్యూట్రిషన్ స్పెషలిస్టు,రేషా నికుంజు దేశాయి న్యూట్రిషన్ ఆఫీసర్, నరసింహారావు ల తో కూడిన బృందం జిల్లాలో పర్యటించింది.బుధవారము,గురువారము రెండు రోజుల పర్యటన లో భాగంగా మొదటి రోజు మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో జరగగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లోని ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గల ఆరోగ్య ఉప కేంద్రాలు తిరుమన్నపల్లి,గన్నారం నందు పోషకాహార లోపంతో బాధపడే సామ్, మామ్ చిల్డ్రన్స్ ను పరిశీలించారు.అక్కడ పోషకాహారం లోపంతో బాధపడే



చిన్నారులకు అందించే సేవలపై యూనిసేఫ్ బృందం సంతృప్తి చెందారు.స్పెషల్ సప్లమెంటరీ ఫీడింగ్ కార్యక్రమంలో భాగంగా రెండవ దశలో నిజామాబాద్ జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైనందున యూనిసేఫ్ బృందం జిల్లా పర్యటనకు వచ్చి క్షేత్ర పర్యటన చేసి రెండు ఆరోగ్య ఉప కేంద్రాలను,డిఎంహెచ్ఓ కార్యాలయాన్ని సందర్శించారు.వారి వెంట జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఉండి వారికి తగు సమాచారాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే జూన్ నెలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు సామ్ మామ్ చిల్డ్రన్స్ కు అందించే స్పెషల్ సప్లమెంటరీ ఫీడింగ్ లో భాగంగా శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్డెంట్ ఇందిరా,న్యూట్రిషన్ విభాగం నుండి రాంబాబు హాజరయ్యారు.

# డిఈవోను కలిసిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మే 08 :**
రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో ఎస్ఏ,తెలుగు,హిందీ,ఉర్దూ అదనపు పోస్టుల మంజూరు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి కోరారు.గురువారం డిఈవో కార్యాలయంలో డిఈవో అశోక్ ను కలిసి సన్మానించారు.జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 250 కంటే అధికంగా ఉన్న చోట కేవలం ఒక్క పోస్టు మాత్రమే మంజూరి ఉందని, జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 400,500,600,1000,1200 వరకు కలిగి ఉన్నాయన్నారు.సంఖ్యకు అనుగుణంగా పోస్టులు మంజూరు చేయబడలేదు కావున సంఖ్యకు అనుగుణంగా తగిన విధంగా తెలుగు,హిందీ,ఉర్దూ



పోస్టులను కేటాయించి నాణ్యమైన విద్య బోధన జరగాలంటే విద్యార్థుల సంఖ్య 250 కంటే అధికంగా ఉన్న పాఠశాలకు అదనపు పోస్టులను మంజూరు చేయాలన్నారు.ఒకవేళ పోస్టుల మంజూరు ఆలస్యమైతే అప్పటివరకు వర్క్ అడ్జస్ట్మెంట్ లో భాగంగా ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఎక్కువ సంఖ్య విద్యార్థులు కలిగిన పాఠశాలలను గుర్తించి మండల విద్యాశాఖ అధికారుల ద్వారా రిపోర్టు తెప్పించుకొని సర్దుబాటు చేయగలరని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా శాఖ పక్షాన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితరాణా ఆధ్వర్యంలో ఎంసిహెచ్ఆర్ డిలో మూడు రోజులు సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో తెలంగాణ వ్యాప్తంగా నిజామాబాద్ ఖ్యాతిని చాటిచెప్పి,ఆదర్శంగా నిలిచి,కార్యదర్శి నుండి మూడు విభాగాలలో ట్రోఫీలు ,అవార్డులు అందుకున్న ఏకైక డిఈవో అశోక్ కుమార్ కి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా పక్షాన ప్రత్యేక అభినందనలు తెలుపుతూ సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జమీలుల్లా.ప్రధాన కార్యదర్శి కె.వి.రమణ చారి,టీపీఆర్టీయూ కృపాల్ సింగ్ సోడి పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ అందగత్తెల భద్రత కోసం ఆపరేషన్ మంకీస్..అక్కడున్న కోతుల తరలింపు!

మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ రాష్ట్రమంతా ముస్తాబవుతుంది.. వివిధ దేశాల నుండి తెలంగాణకు వచ్చే సుందరీమణులు రాష్ట్రంలోని ప్రసిద్ధ ప్రదేశాల సందర్శనకు ఇప్పటికే రూట్ మ్యాప్ రెడీ అయింది.. అందులో భాగంగానే 14వ తేదీన వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్యటన ప్రదేశాల సందర్శనకు ప్లాన్ చేశారు.. వీటిలో యునెస్కో గుర్తింపుపొందిన ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయం, హనుమకొండ లోని వేయి స్తంభాల రుద్రేశ్వరాలయం, ఫోర్ట్ వరంగల్ సందర్శనకు సర్వం సిద్ధం చేస్తున్నారు.అయితే రామప్ప దేవాలయం వద్ద కోతుల బెడద విపరీతంగా ఉటుంది.. ఎన్నో ఏళ్ల నుండి ఇక్కడే ఉన్న వానర సేనలు ప్రజలను ముప్ప తిప్పలు పెడుతున్నాయి. ఆయనాకి వచ్చిన భక్తుల చేతిలో తినుబండారాలు లాక్కొని వారిపై పడి గాయపరిచిన సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయి. అయితే మిస్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన విశ్వసుందరీమణుల ఇక్కడికి రానుడడంతో.. వారికి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తగు రక్షణ చర్యలు చేపడుతుంది.ముఖ్యంగా కోతుల బెడద నుండి వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందేలో భాగంగానే ఆపరేషన్ మంకీస్ పేరుతో రామప్ప పరిసరాల్లో సంచరిస్తున్న కోతులను వలవేసి పట్టుకొని వాటిని ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే 200లకు పైగా కోతులను పట్టుకొని బోన్ లలో తీసుకెళ్లి ఏటూరునాగారం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో వదిలేశారు.మరోవైపు తెలంగాణలోని ప్రసిద్ధ ఆలయాలను సందర్శించేందుకు వస్తున్న సుందరిమణులకు పర్యటన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి ఇష్టమైన వంటకాలతో ప్రత్యేక మెనూను సిద్ధం చేస్తున్నారు.

# దూదిగాం,సోన్ పెట్ లలో భూభారతి రెవెన్యూ సదస్సులు

– పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...







**కబురు న్యూస్,నిజామాబాద్,మే 08 :**
భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా గురువారం నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం దూదిగాం, సోన్ పెట్ గ్రామాలలో నిర్వహించిన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన రైతులతో భేటీ అయ్యి, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు సూచనలు చేశారు. ఒకే దరఖాస్తులో రైతులు రెండు, మూడు రకాల భూ సమస్యలను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్లైన్ లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడదని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హితవు పలికారు. దరఖాస్తుల పరిశీలన ఆన్లైన్ నమోదు ప్రక్రియలపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. భూ రికార్డులలోని వివరాలను పక్కాగా సేకరిస్తూ, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం 18 రాష్ట్రాలలో సమగ్ర అధ్యయనం జరిపి, నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం అమలులోకి తెచ్చిందని అన్నారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన మెండోరా మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ణీత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో కూడా అప్లై చేసుకోవచ్చని అన్నారు. భూ రికార్డులలో పేరు తప్పుగా ఉండడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావంలో మార్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్–బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్దేశం చేశామని కలెక్టర్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద మెండోరా మండలంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన మీదట, జిల్లాలోని మిగితా మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, తహశీల్దార్ సంతోష్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ షాక్.. ఫోన్ చేసి తిట్టిన అమెరికా!

**కబురు న్యూస్, డెస్క్ మే 08 :**
భారతదేశం – పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న సైనిక ఉద్రిక్తత మధ్య, పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ కు అమెరికా నుండి బలమైన సందేశం వచ్చింది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో నేరుగా ఫోన్‌లో షాబాజ్‌ను మందలించి, ఉగ్రవాదంలో పాకిస్తాన్ పాత్రపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే సమయంలో, ఆపరేషన్ సిందూర్ తర్వాత అమెరికా స్పందన పాకిస్తాన్‌కు మరో దౌత్యపరమైన ఎదురుదెబ్బ.అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారతదేశంతో ఉద్రిక్తతలను తగ్గించడానికి పాకిస్తాన్ తీవ్రమైన ప్రయత్నాలు చేయాల్సి ఉంటుందని నిర్మొహమాటంగా చెప్పారు. ప్రధానమంత్రి మోదీని కలవడం ద్వారా పరస్పర సంభాషణను ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఆసియాలో యుద్ధ పరిస్థితి తలెత్తాలని అమెరికా కోరుకోవడం లేదని, కానీ ఉగ్రవాద అంశంపై ఎటువంటి దయ చూపబోమని రూబియో స్పష్టం చేశారు.అదే సమయంలో, రూబియో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు ఫోన్ చేశారు. అలాగే జైశంకర్ తో మాట్లాడి పహల్గామ్ ఉగ్రవాద దాడిపై అమెరికా ఆయనకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. భారతదేశం ఆత్మరక్షణ హక్కును సమర్థిస్తూ, ఉగ్రవాదంపై పోరాటంలో అమెరికా భారతదేశంతో దృఢంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఉగ్రవాదంపై భారతదేశం తీసుకున్న సైనిక



చర్యను వాషింగ్టన్ సమర్థించుకుంటుందని అమెరికా వైఖరి స్పష్టం చేస్తోంది.ఆపరేషన్ సిందూర్ కింద పాకిస్తాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారతదేశం సర్జికల్ స్ట్రైక్ చేసిన తర్వాత మొత్తం ప్రాంతంలో ఉద్రిక్తత స్థాయి పెరిగింది. జమ్మూ, పఠాన్‌కోట్‌లపై పాకిస్తాన్ క్షిపణి, డ్రోన్ దాడుల ప్రయత్నం విఫలమైన తర్వాత భారతదేశం సరిహద్దు ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించింది. ఇంతలో, అమెరికా నుండి వచ్చిన ఈ మందలింపు పాకిస్తాన్ పై అంతర్జాతీయ ఒత్తిడిలో భాగంగా కనిపిస్తోంది.ఇదిలావుంటే అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ స్పందించారు. ప్రస్తుతం జరుగుతున్న భారత్–పాకిస్తాన్ వివాదం ప్రాథమికంగా మాకు సంబంధించినది కాదు అని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ అన్నారు. ఈ పరిస్థితిపై అమెరికాకు పరిమిత నియంత్రణ మాత్రమే ఉందని అన్నారు. “మనం చేయగలిగేది ఏమిటంటే, ఇద్దరిని సంయమనం పాటించాలని సూచించడమే అన్నారు. కానీ ప్రాథమికంగా అమెరికాకు సంబంధం లేనిదన్నారు. అమెరికా నియంత్రించే సామర్థ్యంతో సంబంధం లేని యుద్ధం మధ్యలో మేము పాల్గొనబోమని వాన్స్ స్పష్టం చేశారు.ఈ సమయంలో భారతీయులను ఆయుధాలు వదులుకోమని అమెరికా చెప్పలేదు. పాకిస్తానీలను ఆయుధాలు వదులుకోమని మేము చెప్పలేం. కాబట్టి, దౌత్య మార్గాల ద్వారా ఈ విషయాన్ని కొనసాగిస్తామన్నారు జేడీ వాన్స్. ఇది విస్తృత ప్రాంతీయ యుద్ధంగా, అణు సంఘర్షణగా మారకూడదని మా ఆశ. ప్రస్తుతానికి, అది జరగబోదని అనుకుంటున్నామని అమెరికా ఉపాధ్యాక్షులు జేడీ వాన్స్ అన్నారు.అమెరికా నుండి వచ్చిన ఈ కఠినమైన హెచ్చరిక తర్వాత, షాబాజ్ షరీఫ్ కష్టాలు మరింత పెరిగాయి. ఒకవైపు, భారతదేశం ప్రతీకార సైనిక చర్యకు భయపడుతుంటే, మరోవైపు, అమెరికా వంటి సాంప్రదాయ మిత్రదేశాల అసంతృప్తిని వ్యక్తం చేయడంతో పాకిస్థాన్ దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. భద్రతా వైఫల్యాలపై పాకిస్తాన్‌లోని ప్రతిపక్షం ఇప్పటికే షాబాజ్ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతోంది. అటువంటి పరిస్థితిలో, షాబాజ్ షరీఫ్ భారతదేశంతో ఉద్రిక్తతను తగ్గించడానికి చర్యలు తీసుకుంటారా లేదా పరిస్థితి మరింత దిగజారిపోతుందా అనేది ఇప్పుడు ప్రశ్న..!

# తెలంగాణ మిరప రైతులకు గుడ్ న్యూస్! కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో MIS పథకం అమలు

**కబురు న్యూస్, డెస్క్ మే 08 :**

తెలంగాణ మిరప రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ముందస్తు జోక్యంతో మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం లోని పీడీపీ ద్వారా తెలంగాణలోని మిరప రైతులకు మోడీ ప్రభుత్వం మద్దతు అందించింది. మిరప రైతులు సాగు ఖర్చు కంటే తక్కువ ధరకు పంటను అమ్మాల్సి రావడంతో, ఈ అంతరాన్ని పూడ్చడానికి ఈ మద్దతు ధరను ఇవ్వనున్నారు.MIS మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పథకం తెలంగాణలో అమలు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. అవసరమైన చర్యలు ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ శాఖను ఆదేశించింది.తెలంగాణలో మిర్చి రైతుల నష్టాలను ఆపడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఏప్రిల్ 4న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఖమ్మం, మహబూబాబాద్, జోగులాంబ గద్వాల్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మిర్చి అధికంగా పండుతుంది. కానీ ప్రస్తుతం, ఈ రైతులు తమ ఉత్పత్తి ఖర్చు కంటే తక్కువ ధరకు మిరపకాయలను అమ్ముకోవాల్సి వస్తోందని కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కూడా ఒక అభ్యర్థన వచ్చింది.ఈ నేపథ్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ అంచనా వేసిన మిరప ఉత్పత్తి 6,88,540 మెట్రిక్ టన్నులలో 1,72,135 మెట్రిక్ టన్నులను (అంటే 25 శాతం) రక్షించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చు మధ్య వ్యత్యాసాన్ని కవర్ చేస్తారు. MIS కింద మిరపకాయ రేటు క్వింటాలుకు రూ.10,374గా నిర్ణయించబడింది. ప్రారంభంలో, రాష్ట్ర ప్రభుత్వం ఈ మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50–50 శాతం ఆర్థిక భారాన్ని భరిస్తాయి.కొంతమంది బ్రోకర్లు క్వింటాలుకు రూ.5,000 నుండి రూ.6,000 వరకు చాలా తక్కువ ధరకు రైతుల నుండి మిర్చిని కొనుగోలు చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేరాయి. ఈ కేసులలో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిర్దిష్ట చర్య తీసుకోలేదు. అందువల్ల, కిషన్ రెడ్డి ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమోదించబడిన APMC (వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీ) మార్కెట్ల ద్వారా తమ ఉత్పత్తులను విక్రయించే రైతులకు మాత్రమే ఈ పథకం ప్రయోజనం లభిస్తుంది. ఈ పథకం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రారంభించిన విస్తృత చొరవ ప్రధాన మంత్రి అన్నదాత ఆయి సంక్రాంతి అభియాన్ (PM-AASHA)లో భాగం. మార్కెట్ ధరలు పడిపోవడం వల్ల కలిగే నష్టాల నుండి రైతుల ఆదాయాన్ని రక్షించడం దీని లక్ష్యం.

# ఆదర్శ పాఠశాల కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ప్రారంభం

– ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల జక్రాన్ పల్లి ప్రిన్సిపాల్ కె.సుధారాణి...



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మే 08 :**
తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల జక్రాన్ పల్లి లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల జక్రాన్ పల్లి ప్రిన్సిపాల్ కె.సుధారాణి తెలిపారు.ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి 5 మే 2025 నుండి 20 మే 2025 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా 26 మే 2025న సంస్థ నోటీసు బోర్డులో ప్రదర్శించబడుతుందని, సర్టిఫికెట్ల ధృవీకరణ ప్రవేశ ప్రక్రియ పూర్తి చేయడం 27 నుండి 31 మే 2025 వరకు పూర్తవుతుందన్నారు.సీట్ల కేటాయింపు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మెరిట్,రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా ఉంటుందన్నారు.ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు,ఉచిత నోట్‌బుక్‌లు,ఈఏపిసిఈటీ/ నీట్ కోచింగ్, కెరీర్ కౌన్సెలింగ్,బాలికలకు హాస్టల్ సౌకర్యం, మీడియా,ఎంటర్‌టైన్‌మెంట్ కుట్టు అల్లికలు వృత్తిపరమైన కోర్సులు,పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు కూడా లభిస్తాయని ప్రిన్సిపాల్ కె.సుధారాణి వివరించారు.

# హెన్రీ డునాంట్ కు ఘన నివాళి



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మే 08 :**
ప్రపంచ రెడ్ క్రాస్ స్థాపకుల్లో ఒకరైన హెన్రీ డునాంట్ జయంతిని నగరంలోని రెడ్ క్రాస్ భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు.రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు హేన్రి డునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అందరూ సమష్టిగా సమైక్యతతో రెడ్ క్రాస్ సంస్థతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు.స్వచ్ఛంద సంస్థలు కలిసి నడిస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు.ఇందుకు రెడ్ క్రాస్ సంస్థ ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందన్నారు.భవిష్యత్ లో సేవలను మరింత పెంచేందుకు నగర ప్రజలు,స్వచ్ఛంద సంస్థలు,మానవవాదులు ముందుకు వచ్చి అండగా నిలవాలన్నారు.ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ 84వ సారి, అలాగే రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ కుమార్ రెడ్డి,రామకృష్ణ రక్తదానం చేశారు.రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల్ భవన్ లో బుధవారం నిర్వహించిన వ్యాసరచన,చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి కరిపె రవీందర్, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం,వైస్ చైర్మన్ మురళీకృష్ణ ,జూనియర్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ అబ్బాపూర్ రవీందర్, యూత్ కో ఆర్డినేటర్ మాణిక్యాల శ్రీనివాస్,ఎంసీ మెంబర్లు శ్రీనివాస్,సోలమన్,బాబా శ్రీనివాస్,వెంకటేశ్వర్లు ,డాక్టర్ రాజేశ్,బొద్దుల రామకృష్ణ,బాల్ భవన్ సూపెరిండెంటెంట్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.




– టియుసిఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కే.సూర్యం...

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మే 08 :**
ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ సమావేశం శ్రామిక భవన్,కోటగల్లిలో నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం మాట్లాడుతూ,గత 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు.అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగినాయని,కానీ కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు.కార్మికులకు ఉద్యోగ,ఆరోగ్య భద్రత కరువైందన్నారు.మోడీ ప్రభుత్వం అవలంబించిన కార్పోరేట్ కంపెనీల అనుకూల,కార్మిక వ్యతిరేక విధానాలే ఇందుకు కారణమన్నారు.మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా,కనీస వేతనాల అమలు కోసం,కనీస పెన్షన్ 9వేల అమలు కోసం,కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా,పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు.ఈ సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్,జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న డి.రాజేశ్వర్ జిల్లా నాయకులు లక్ష్మణ్,సాయన్న,రెహనా,రాజేశ్వర్,కిరణ్, విటల్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా జమ్మికుంట శివాలయంలో అన్నదాన కార్యక్రమం

**కబురు న్యూస్,జమ్మికుంట మే 8..**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ 58వ పుట్టినరోజు సందర్భంగా దేశిని కోటి ఆధ్వర్యంలో కేక్ కట్ కట్ చేసి జమ్మికుంట బొమ్మల గుడి శివాలయంలో పోన్నం ప్రభాకర్ అన్న పేరు పై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . దేశం కోటి మాట్లాడుతూ పున్నం ప్రభాకర్ అన్న ఎన్ ఎస్ యు ఐ నాయకుడు నుండి రాష్ట్ర మంత్రిగా ఎదిగిండు కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్లో ప్రాణాలకు తెగించి కొట్లాడిన గొప్ప నాయకుడు నాడు ఆంధ్ర నాయకులు పెప్పర్స్ పే దాడి చేసినా కూడా తెలంగాణ రాష్ట్ర కోసం తెలంగాణ ఎంపీల అందరిని ఒక తాటిపై తీసుకొచ్చి సోనియా గాంధీని ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్ గారిని మెప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు పోన్నం ప్రభాకర్ అన్న



ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గా ఉండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కావాలని ఉద్యోగులకు విద్యార్థులకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యమంత్రి మెప్పించి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి ఢిల్లీలో ధర్నా చేసి బీసీ రిజర్వేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నాడు పోన్నం ప్రభాకర్ అన్న ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఎప్పుడూ చల్లగా ఉండాలని రానున్న రోజుల్లో ఉన్నతమైన పదవులు చేపట్టాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో



ఎర్రబెల్లి రాజేశ్వరరావు సుంకరి రమేష్ సాయిని రవి జమ్మికుంట మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న .మారెపల్లి బిక్షపతి . ఎలగందుల శ్వేత శ్రీహరి .పిట్టల శ్వేత రమేష్. పొనగంటి సారంగం. దిడ్డి రామ్మోహన్. కుదాడి రాజన్న. గోల్లి పుల్లమ్మ మొగిలి. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట స్వప్న కాంగ్రెస్ నాయకులు పూదరి శివ .మరి రాంరెడ్డి. పంజాల అజయ్ ముద్దమల్ల రవి పోతుల శ్రీనివాస్ అశోక్ రాజ్ కుమార్ శ్రీను యూత్ కాంగ్రెస్ నాయకులు పర్లపెల్లి నాగరాజు ఎండి సజ్జు పాతకాల రమేష్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు

# వరిగోస పడుతున్న రైతులు.. పట్టించుకోని అధికారులు

**కబురు న్యూస్, అందోలు మే 8..**



ఆరుగలం శ్రమించి పంటను పండిస్తే దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ అధికారులు నీళ్ల రక్తం వహించడంతో రైతన్నలు వరిగోసులు పడక తప్పడం లేదు. చేతికొచ్చిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబోసుకున్న రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క వాతావరణ శాఖ వర్షాలు ఉన్నాయని హెచ్చరిస్తుండడంతో మరోపక్క ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో రైతులు తమ తమ వరికుప్పల వద్ద కాపలాదారులుగా పడి ఉంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని రైతన్నలు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీసం తాగడానికి నీటి సౌకర్యం లేక ఎండలో చెట్ల నీడకు కూర్చునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనాప్పటికీ ఇప్పటికైనా ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తే కొంతవరకు తమకు మేలు జరుగుతుందని రైతులు కోరుతున్నారు.

# ఇల్లందకుంట.లో మంత్రి పున్నం ప్రభాకర్ జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

**కబురు న్యూస్, ఇల్లందకుంట మే 8..**
ఇల్లందకుంట మండల కేంద్రంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖల మాత్యులు పొన్నం ప్రభాకర్ జన్మదినం మండల పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చన నిర్వహించి అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్ది కుమార్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం ఇల్లందకుంట మండల కేంద్రంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.
పొన్నం ప్రభాకర్ కళాశాల కన్వీనర్ నుంచి ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్ష పదవి వరకు బాధ్యతలు చేపట్టి విద్యార్థి లోకానికి సేవలు అందించారని, అలాగే కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకుడు పొన్నం ప్రభాకర్ ని తెలిపారు., ఉమ్మడి కరీంనగర్ ఎంపీ గా అనేక అభివృద్ధి కార్యక్రమాలను అందించిన ఘనత పొన్నం



ప్రభాకర్ దని, హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట రైల్వే స్టేషన్ ను ఆదర్శ స్టేషన్ గా అభివృద్ధి చేసిన ఘనత పొన్నం ప్రభాకర్ ది.
ఎంపీ గా పార్లమెంట్లో తెలంగాణ వాణిని వినిపించి, పెప్పర్ స్ప్రే కు గురై ప్రాణాలను లెక్క చేయకుండా తెలంగాణ కోసం పార్లమెంటులో పోరాడిన నాయకుడు పొన్నం ప్రభాకర్ గారని తెలిపారు. ఈ రోజు తెలంగాణ లో ప్రజా ప్రభుత్వంలో మంత్రిగా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ప్రజలకు అందిస్తున్న నాయకుడు పొన్నం అని కొనియాడారు. ఈ సందర్భంగా ఇల్లందకుంట మండల ప్రజల పక్షాన



జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో :-ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, బుర్ర రమేష్, కనుమల్ల రామకృష్ణ, కనుమల్ల సంపత్,మీస రాజయ్య, గూడెపు ఓదెలు, చిరంజీవి, గోలి కిరణ్, పరమేశ్వర్, బొమ్మ శ్రీనివాస్, గుండారం సాయికుమార్, బండి మల్లయ్య, మిట్ట మోహన్ రావు, బైరెడ్డి కొండల్ రెడ్డి, మూడేళ్ల రమేష్, గురుకుల స్వామి భోగం సాయికుమార్, మారపల్లి వేణు, ఎండి గాపూర్, పైడిపల్లి దేవేందర్, మోత్కూరి శ్రీనివాస్, మనసాని రవి తదితరులు పాల్గొన్నారు.

# భరోసా ఆధ్వర్యంలో వృద్ధులకు చేతి కర్ర అందజేత



**కబురు న్యూస్, గోదావరిఖని మే 08:**
రామగుండం పట్టణంలో నిస్సహాయ వృద్ధులకు భరోసా ఫౌండేషన్ ఆర్గనైజర్ నసీమ జన్మదినం సందర్భంగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంకొకరి తోడు అవసరం లేకుండా వారి సౌకర్యం కొరకు నడవడానికి చేతి కర్రను అందజేశారు. చేతి కర్రను వృద్ధులకు అందజేయడ%శీ%, వృద్ధుల మధ్య జన్మదినాన్ని జరుపుకున్నంత సంతోషంగా ఉందని, లబ్ధిదారులు కళ్ళల్లో ఉన్న ఆనందమే నాకు ఆశీర్వాదం అవుతుందని, రాబోయే రోజుల్లో కూడా నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లికొండ రాజేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ కి జన్మదిన శుభాకాంక్షలు

**- పీసీసీ సభ్యులు పత్తి కృష్ణా రెడ్డి**
**- దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు**

**కబురు న్యూస్, ఇల్లందకుంట మే 8..**
విద్యార్థి నాయకుడిగా,తెలంగాణ కోసం పార్లమెంట్ లో కొట్లాడిన వీరుడిగా,అసెంబ్లీలో కులగణన బిల్లు పెట్టి బిసిల గొంతుకగా,ప్రజల మనసు గెలుచుకున్న బహుజన ముద్దు బిడ్డ బితెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కై పరితపిస్తున్న మా అభిమాన నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ కి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్ ని శాలువాతో సన్మానం చేసి గజమాలతో సత్కరించడం జరిగింది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం లడ్డు ఇవ్వడం జరిగింది అధికారం లేనప్పుడు ఉమ్మడి కరీంనగర్



జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ని కాపాడటానికి విస్తృత పర్యటనలు, మండల స్థాయి వరకు కార్యక్రమాలు చేసిన నాయకులు పొన్నం ప్రభాకర్ అవకాశాలను సమర్థవంతంగా పూర్తి చేయగలిగాం, నిరూపించుకున్నాం. మీ సేవా మార్గం ఎంతో మందికి దిక్సూచి. బిలిరాష్ట్ర సంక్షేమాభివృద్ధి లో రేవంతన్నకు అండగా ఉండే మా అభిమాన నాయకులు పొన్నం ప్రభాకర్ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో.. చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేష్, కిరణ్, కిషన్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, నారాయణరెడ్డి, చిరంజీవి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దీక్షిత్ సురేష్ హుజరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ స్వామి రెడ్డి మాజీ మండలాధ్యక్షుడు మహేందర్ హుజరాబాద్ టౌన్ అధ్యక్షులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు



**కబురు న్యూస్, జమ్మికుంట మే 8..**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమం రోడ్డు రవాణా శాఖ మంత్రివర్యులు వారి జన్మదినోత్సవ సందర్భంగా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల గ్రౌండ్లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారి జన్మదినోత్సవం పురస్కరించుకొని కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ బ్లాక్- బి అధ్యక్షులు మోలుగూరి సదయ్య మాట్లాడుతూ మంత్రి ఆయురారోగ్యాలతో ఉంటూ రాబోయే రోజులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరడం జరిగింది. జమ్మికుంట వాకర్స్ అసోసియేషన్ జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాకర్స్ కాసుభోజుల వెంకన్న, సలీం, కనకం తిరుపతి, ప్రభుదాస్, గుండేటి శ్రీధర్, ఎదులాపురం, వెంకన్న, కొండరాజు, తిరుపతి శ్రీనివాసు, సిటికేసి కోటి తదితరులు పాల్గొన్నారు.

# సాయినగర్ బాబా ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం

**కబురు న్యూస్, వేములవాడ మే 8..**
మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1476 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో గురువారం రోజున స్థానిక లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ రాజన్న భీమేశ్వర మరియు సాయినగర్ బాబా ఆలయం వద్ద పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికుమార్ శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహలత దంపతులు ప్రతాప సంపత్ స్వప్న దంపతులు నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర





దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని పేదలకు అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించాలను కునే దాతలు ట్రస్టు సభ్యులను సంప్రదించా లని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాగుల చంద్రశేఖర్, ప్రతాప నటరాజు, పొలాస రాజేందర్, పసుల శ్రీనివాస్, సగ్గు రాహుల్ పాల్గొన్నారు.

# మనస్థాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడు

**కబురు న్యూస్, జమ్మికుంట మే 08..**



జమ్మికుంట లో ప్రేమ విఫలమై మనస్థాపానికి గురై రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దార ఏల్లేష్ వయస్సు 23 సంవత్సరాలు ఇల్లందకుంట నివాసి ఇంటర్మీడియట్ జమ్మికుంట లో చదువుచున్నప్పుడు వరలక్ష్మి అనే అమ్మాయి తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది కానీ వరలక్ష్మి వేరే వ్యక్తిని వివాహం చేసుకోవడం వలన ప్రేమ విఫలమై మనస్థాపం చెంది జమ్మికుంట రైల్వే స్టేషన్ లో ఎదో రైలు బండి కింద పడి ఆత్మ హత్య చేసుకొని చనిపోయాడు అని మృతుని తల్లి అయిన రాజేశ్వరి తెలిపినది. ఇట్టి కేసును జి. తిరుపతి ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రామగుండము పరిశోదన చేస్తున్నామన్నారు

## హుజురాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుక నిర్వహించారు



**కబురు న్యూస్, హుజురాబాద్ మే 8..**
హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేత రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ & రావాణా శాఖా మంత్రి వర్యులు పోన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొల్లూరి కిరణ్ కుమార్ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుల్ల రాధ హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మేకల తిరుపతి హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత మార్కెట్ కమిటీ చైర్మన్ గుడూరి రాజేశ్వరి-స్వామి రెడ్డి హుజురాబాద్ హనుమాన్ టెంపుల్ చెర్మెన్ కొలిపాక శంకర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చల్లూరి రాహుల్ హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి మిడిదొడ్డి రాజు ఎస్సీ సెల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్ర రవీందర్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి తరుణ్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షురాలు గొస్కుల నాగమణి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆలేటి సుశీల మైనారిటీ నాయకులు యండి అఫ్సర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేరేళ్ళ మహేందర్ గౌడ్ నర్సింగ్ రాంశకర్ గౌడ్ యండి ఇమ్రాన్ మోరె తిరుపతి రాజ్ కుమార్ ఉమాపతి రావు కుమార్ సొల్లు సునిత కడారి తిరుమల అనిల్ వినోద్ గణేష్ ఎర్ర నాగరాజు కుంట నర్సింహారెడ్డి యండి రియాజ్ యండి సలీం రాధ యండి కరీమా తదితరులుపాల్గొన్నడం జరిగింది

# మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన సందర్భంగా 58 మందితో రక్తదాన శిబిరం

**కబురు న్యూస్,హుజురాబాద్ మే 8..**
హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ నాయకత్వంలో నియోజకవర్గ మొత్తం ఘనంగా మంత్రి జన్మదిన వేడుకల్లో భాగంగా యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణం సివిల్ హాస్పిటల్ లో రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ 58 వ జన్మదిన సందర్భంగా 58 మందితో పాటు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్ రక్తదానం చేయడం జరిగింది అనంతరం యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థి ఉద్యమాల నుండి కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలందించిన ఘన చరిత్ర కలిగిన వారు తెలంగాణ ఉద్యమంలో అనేకమంది ప్రాణాలర్పిస్తుంటే చూడలేక పార్లమెంట్లో తెలంగాణ కోసం కొట్లాడి బిల్లు ప్రవేశపెట్టించిన ఘనత ప్రభాకర్ అన్నకే దక్కుతుంది కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఆటుపోట్లు తిన్న ఏ ఒక్క రోజు పార్టీని విడిచిపెట్టకుండా పార్టీకి వెన్ను తట్టి నిలుస్తూ





కార్యకర్తలకు అండగా ఉన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంలో పొన్నం ప్రభాకర్ ది కీలక పాత్ర పోషించారు బీసీ కులగణలో దేశానికి ఆదర్శంగా కులగన్న చేయడంలో ప్రభాకర్ అన్న శ్రమ ఎంతో ఉంది మాలాంటి యువజన కాంగ్రెస్ వారికి ఒక ఆదర్శప్రాయకుడిగా ఉన్నాడని రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ జన్మదినం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొలువురి కిరణ్, సీనియర్ నాయకులు సొల్లు బాబు, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సుశీల, మహిళా పట్టణ అధ్యక్షురాలు పుష్పలత, మహిళా మండల అధ్యక్షురాలు పుల్ల రాధ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ గోస్కుల నాగమణి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ తరుణ్, మండలం వైస్ ప్రెసిడెంట్ సంపంగి అరుణ్ కుమార్,సోషల్ మీడియా ఇంచార్జ్ మిడిదొడ్డ రాజు, మహిళా కమిటీ కరీమా

## కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసిన శాసనమండలి కంటెస్టెంట్ అభ్యర్థి సిలివేరి శ్రీకాంత్




**కబురు న్యూస్,జమ్మికుంట మే 8..**
జమ్మికుంట పట్టణానికి చెందిన శాసనమండలి కంటెస్టెంట్ అభ్యర్థి సిలువేరి శ్రీకాంత్ గురువారం రోజున కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ను మర్యాదపూర్వకంగా కలిసి పూల పూల మొక్కను అందజేశారు ఈ సందర్భంగా సిలివేరి శ్రీకాంత్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గం లోని జమ్మికుంట హుజురాబాద్ ఇల్లందకుంట వీణవంక మండలాలలో విచ్చలవిడిగా గంజాయిని స్మగ్లింగ్ చేయడం వలన విద్యార్థులు గంజాయి వ్యసనానికి అలవాటై వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుతుందని ఈ సందర్భంగా సిలివేరి శ్రీకాంత్ కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు

# అన్ని శాఖల సమన్వయంతో... యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి..

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

**కబురు న్యూస్,గోదావరిఖని మే 08:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ అధ్యక్షతన రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి మంచిర్యాల జిల్లా పరిధిలోని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సిఎల్, ప్రధానమైన ఇండస్ట్రియల్ సంస్థల అధికారులు, భద్రతాధికారులు మరియు రామగుండం కమిషనరేట్ పరిధిలోని డిసిపిలు ఏసిపిలతో భద్రతా పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించడంతోపాటు ప్రధాన మైన సంస్థల ప్రాంతాల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ రక్షణ వ్యవస్థ, భద్రతా వ్యవస్థను కట్టదిట్టం చేయాలని అధికారులకు పోలీస్ కమీషనర్ ఆదేశించారు. రామగుండం కమీషనరేట్ ప్రాంత రక్షణ పరంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ అన్ని శాఖల




యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. అని ఇండస్ట్రీయల్ సంస్థల వద్ద భద్రతను పెంచాలి. అత్యవసర సర్వీసులు అందించే విభాగాల ఉద్యోగులు, అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి, నిరంతర నిఘా, పర్యవేక్షణ చేపట్టాలని సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయడానికి చర్యలు అన్ని భద్రత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమీషనరేట్ పరిధిలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి భాస్కర్ ఐపీఎస్., పెద్దపెల్లి డిసిపి కర్ణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, సుధేష్ జంకర్ సిఐఎస్ ఏ/ఏసీ, సర్వర్ సిఐఎస్ఎఫ్ కమాండెంట్, రాజు, డిప్యూటి కమాండెంట్, చందన్ కుమార్ సమత ఎన్టీపీసీ ఈడీ, లలిత్ కుమార్ ఆర్ జి వన్ జీఎం, రాముడు జిఎం. ఆర్జి -2, ఎం సుదర్శన్ రావు ఆర్జి త్రీ జిఎం, ఎం.శ్రీనివాస్ జిఎం శ్రీరాంపూర్, ఉదయ్ ఆర్ఎఫ్సిఎల్ సిజిఎం, సోమనాథ్ సంక డిజిఎం హెచ్ఆర్ ఎన్టిపిసి, భగవాన్ రెడ్డి మంచిర్యాల్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, అనిల్ కుమార్ పెద్దపల్లి డిస్టిక్ ఫైర్ ఆఫీసర్, బి.రాంబాబు ఏఈ ఈ.పార్వతీ పంప్ హౌస్, రాకేష్ రెడ్డి, రామగుండం, రవి రాజ్ ఐఓసీఎల్ రామగుండం, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసిపిఎం రమేష్ మంచిర్యాల ఐఎఫ్ఎస్సి జైపూర్ ఏసిపి ఆర్.వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, అధికారులు, సింగరేణి ఎన్ టి పి సి, ఆర్ఎఫ్సిఎల్, తదితర సంస్థల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు






**కబురు న్యూస్,జమ్మికుంట మే 8..**
కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని స్పందన అనాథ శరణలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్స్, పండ్లు నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ ప్రియతమా నాయకులు మాజీ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు,మాజీ కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి కరీంనగర్ జిల్లా టైగర్ పొన్నం ప్రభాకర్ అన్న 58 వ పుట్టినరోజు వేడుకులను స్పందన అనాధాశ్రమంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు పొన్నం పోరాట నేపథ్యం మాలాంటి యువతకి ఎంతో మందికి స్ఫూర్తి దాయకం అని అన్నారు పొన్నం పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్నటువంటి పార్లమెంట్ సభ్యులని అందరిని తెలంగాణ ఉద్యమానికి మద్దతు పలికే విధంగా ఏకతాటిపైకి తీసుకొచ్చి సోనియా గాంధీ ని మెప్పిచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రన్ని తీసుకరావడంలో ప్రత్యేక పాత్ర పోషించారన్నారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో మహిళలకి ఉచిత బస్ ప్రయాణం కల్పించారాని ప్రత్యేక చొరవతీసుకొని ఆ యొక్క పథకాన్ని అమలు పరచడం ఎంతో గర్వకారణం అన్నారు ఎన్నో సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకై కేంద్ర ప్రభుత్వంనికి పంపిన ఘనత పొన్నం కే చేందుతుంది అని అన్నారు అదే విందంగా వారు రానున్న రోజుల్లో ఇంకా మరెన్నో పదవులు అధిరోహించాలని తెలంగాణ రాష్ట్రానికి అభివృద్ధి పదంలో నడుపుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి బడుగు, బలహీనవర్గాల అందరికీ అండగా నిలవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిని రవి, ఐ ఎన్ టి యూ సి జిల్లా అధ్యక్షులు అంబాల శ్రీనివాస్, సేవాదల్ నియోజకవర్గ అధ్యక్షులు నరెడ్ల వినోద్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు తోట స్వప్న, మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, పిట్టల శ్వేత రమేష్ యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహ్మద్ సజ్జు జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగే శ్రీకాంత్, హుజురాబాద్ మండల అధ్యక్షులు పంజాల అరవింద్ గౌడ్, వీణవంక మండల అధ్యక్షులు శీలం సురేందర్ రెడ్డి యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పంజాల అజయ్, చెన్నావేనా రమేష్ కార్యదర్శులు ఉమ్మడి సందీప్, రోమాల రాజ్ కుమార్, పాతకాల రమేష్, మండల కమిటీ ఉపాధ్యక్షులు వినయ్, శ్యామ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మహేష్, కార్యదర్శులు రవి, అజయ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాచపల్లి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొడ్డే నవీన్, మొలుగూరి రమేష్, యువజన నాయకులు ప్రవీణ్, రాజు, జావీద్, శివ, శ్రీకాంత్, భాను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# సారూ బోరు మోటర్ బాబు చేయించండి..

**కబురు న్యూస్, అందోలు మే 8..**
సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అక్సాన్ పల్లి గ్రామ రైతు వేదిక వద్ద బోరు మోటరు చెడిపోయి నెలలు గడుస్తున్న ఏ ఒక్క అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. తాము పండించిన పంటను ఇక్కడే కుప్పలు పోసుకొని కల్లాలు ఏర్పాటు చేసుకున్న తమకు తాగడానికి నీళ్లు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ బాధను పట్టించుకోని బోరు మోటర్ బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.



# నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా..

- నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీస్ కమిషనరేట్ లో టాస్క్ ఫోర్స్ టీమ్స్ ఏర్పాటు
- అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్ష
- నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేయాలని చూస్తే సహించం
- నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలు చేస్తాం
- -పోలీస్ కమీషనర్ డాక్టర్ బి. అనురాధ, -



**కబురు న్యూస్, సిద్దిపేట మే 08..**
ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు, కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలు అని చెప్పి రైతులకు అమ్మడం తీరా అవి సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. రైతులు నకిలీ, కల్తీ విత్తన మురాల బారిన పడకుండా మేలు రకం విత్తనాలు విక్రయించే విధంగా నకిలీ, కల్తీ విత్తనాలు స్మగ్లింగ్ పై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ డీజీపీ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సిద్ధిపేట కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని మేడమ్ గారు తెలిపారు. వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. వారిని అరికట్టడం లో భాగంగా వ్యవసాయశాఖ, టాస్క్ ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ బృందాలు రైతులను మోసం చేసే, నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని గుర్తించి వారిపై గతంలో కేసులు నమోదైన వారిపై నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించి వారిపై కఠినంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు సిద్దిపేట జిల్లా పరిధిలో విత్తన, ఎరువుల దుకాణాలను, గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీలు, అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్షలకు పంపించడం, రవాణా వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుంది. లైసెన్స్ లు లేకుండా వ్యాపారం చేసే వారిపై, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాల జారీ చేయడం జరిగింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు,మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడంతోపాటు నకిలీ, కల్తీ విత్తనాల అక్రమ రవాణాను, సరఫరా నిరోధించేందుకు ఇన్ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేయడం జరిగిందిని నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలు చేయడానికి వెనుకడుగు వేయమని హెచ్చరించారు.నకిలీ విత్తనాలు కలిగి ఉన్న రైతులకు అమ్మడానికి ఎవరైనా ప్రయత్నించిన వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

# డౌట్ వస్తే కాల్చి పారేయండి ఆర్మీకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన కేంద్రం..

**కబురు న్యూస్, న్యూఢిల్లీ మే8..**
ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్,పాకిస్తాన్ బార్డర్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సరిహద్దులోని భారత పౌరులను లక్ష్యంగా చేసుకుని పాక్ కాల్పులు జరుపుతోంది. మే 7న అర్ధరాత్రి పాక్ జరిపిన కాల్పుల్లో 13 మంది పౌరులు చనిపోయారు. మే 8న అమృత్ సర్ ను టార్గెట్ చేసిన పాక్ .. మిసైల్ తో దాడి చేసేందుకు ప్రయత్నించింది. అమృత్ సర్ పరిసర ప్రాంతాల్లో మిసైల్ శకలాలు లభ్యమయ్యాయి. దీంతో కేంద్రం అలర్ట్ అయ్యింది. సరిహద్దు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. అటు పాకిస్థాన్ బార్డర్ లోని రాజస్తాన్, పంజాబ్ బార్డర్ లను మూసివేశారు.



రాజస్థాన్,పంజాబ్ లలో బహిరంగ సభలపై ఆంక్షలు విధించారు.సరిహద్దులో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే కాల్చివేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది కేంద్రం. పాకిస్తాన్‌తో 1,037 కి.మీ సరిహద్దును పంచుకునే రాజస్థాన్‌లో హై అలర్ట్ ప్రకటించారు. సరిహద్దును పూర్తిగా మూసివేస్తున్నామని, ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సరిహద్దు భద్రతా దళ సిబ్బందికి కాల్పులు జరపాలని ఆదేశాలు జారీ చేశామని అధికారులు తెలిపారు. జోధ్‌పూర్, కిషన్‌గఢ్ , బికనీర్ విమానాశ్రయాల నుంచి విమానాల రాకపోకలను మే 9 వరకు నిలిపివేశారు. సుఖోయ్-30 ఎంకేఐ జెట్‌లు గంగానగర్ నుంచి రాన్ ఆఫ్ కచ్ వరకు వైమానిక గస్తీ నిర్వహిస్తున్నాయి. బికనీర్, శ్రీ గంగానగర్, జైసల్మేర్ , బార్మర్ జిల్లాల్లోని పాఠశాలలు మూసివేయబడ్డాయి, పరీక్షలు వాయిదా వేయబడ్డాయి. పోలీసులు ,రైల్వే సిబ్బంది సెలవులు రద్దు చేశారు. పంజాబ్‌లో, అన్ని పోలీసు సిబ్బంది సెలవులను రద్దు చేశారు. బహిరంగ సభలపై ఆంక్షలు విధించారు. సరిహద్దుల్లో ఉద్రిక్తత కారణంగా ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను రద్దు చేశారు.

# భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సు లో పాల్గొన్న కలెక్టర్ గౌతం పొట్రో.

- అప్లికేషన్ లో సరిగ్గా కోడ్ కానీ ధరణి అప్లికేషన్ నెంబర్ కంపల్సరీ.
- మళ్ళీ ఇలాంటి పొరపాట్లు జరిగితే యాక్షన్ విల్ బి టేకెన్ ..కలెక్టర్.

**కబురు న్యూస్, మేడ్చల్ జిల్లా, మే8..**
మేడ్చల్ జిల్లా కీసర మండలం ధర్మారం,నర్సంపల్లిలో పైలెట్ ప్రాజెక్ట్ కింద కొత్తగా భూ భారతి చట్టం పై రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు.భూ భారతి రెవెన్యూ సదస్సును కు విచ్చేసిన జిల్లా కలెక్టర్ గౌతం



పొట్రో. ఉదయం నుండి రైతుల నుండి తీసుకున్న దరఖాస్తులను పరిశీలించిన జిల్లా కలెక్టర్. కొన్ని దరఖాస్తుల్లో కోడ్ వేయడం లేదు తప్పని సరి కోడ్ వేయాలి అని సిబ్బందికి సూచించిన జిల్లా కలెక్టర్.అలాగే ధరణిలో



అప్లికేషన్ పెట్టుకుంటే ఆది కూడా తప్పని సరి రాయాలి ఈరోజు మొదటి రోజు అని ఊరుకుంటున్న మళ్ళీ ఇలాగే రిపీట్ అవుతే i will take action అని సీరియస్ గా చెప్పి వెళ్ళిపోయిన జిల్లా కలెక్టర్.

# దమ్మాయిగూడ బీజేపీ అధ్యక్షుడిగా తోట నరేష్ .

- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి - ఈటల రాజేందర్

**కబురు న్యూస్, కీసర, దమ్మాయిగూడా మే, 8:**
దమ్మాయిగూడ మున్సిపాలిటీ బీజేపీ నూతన అధ్యక్షుడిగా తోట నరేష్ పటేల్ నియమితులయ్యారు. నూతన బాధ్యతల నేపథ్యంలో తోట నరేష్, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ సమక్షంలో మర్యాదపూర్వకంగా గురువారం కలిసారు. ఈ సందర్భంగా పార్టీ నాయకత్వంపై కృతజ్ఞతలు తెలియజేశారు. తన నియామకాన్ని స్వాగతించిన ఈటల, తోట నరేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ "ఇచ్చిన పదవిని సేవా అవకాశంగా భావించాలి. పార్టీకి సేవలందించడమే గాక, స్థానికంగా



బీజేపీ శక్తిని విస్తరించేందుకు ప్రతినిధులుగా మీరు శ్రమించాలి" అని సూచించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తోట నరేష్ మాట్లాడుతూ, "నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత ఇచ్చిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు. నేనీ బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వహిస్తాను. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాను" అని అన్నారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి తదితర నేతలను కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో గాలి సంపత్ యాదవ్, విక్రమ్ సింగ్, శేఖర్ చారి, బిలకంటి ధర్మేందర్, గోవర్ధన్ రెడ్డి, పద్మావతి, చక్రపాణి, రగునాథ్ సింగ్, శేఖర్ గౌడ్, డాక్టర్ బాలయ్య, ఆంజనేయులు కుమార్, లింగా సంతోష్, చిరంజీవులు, సుధాకర్, ప్రణీత్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# వరదరాజస్వామి దేవాలయానికి విరాళం అందజేసిన కరుణాకర్ రెడ్డి



**కబురు న్యూస్,మర్కుక్ మే 08..**
సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వరదరాజపూర్ గ్రామంలోని పురాతన ఆలయం వరదరాజ స్వామి దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా గురువారం మర్కుక్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మర్కుక్ కరుణాకర్ రెడ్డి .25 వేల రూపాయలు విరాళం ఆలయ పురోహితులు వరదాచార్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ గోపాలకృష్ణ ,మాజీ సర్పంచ్ లక్కాకుల నరేష్, ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్,బీఆర్ఎస్ నాయకులు సాయిని మహేష్, సుదాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆంజనేయ స్వాములు



**కబురు న్యూస్, గజ్వేల్ మే 08..**
గ్రామ ప్రజలను చల్లగా చూడాలని సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపూర్ గ్రామంలో చిన్న పెద్దలు తేడా లేకుండా హనుమాన్ స్వామి మాలలు ధరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ



గ్రామ ప్రజలను పాడిపంటలు ఆయురారోగ్యాలతో ఉంచాలని శ్రీ ఆంజనేయస్వామి, రాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆంజనేయస్వామి ప్రజల సుఖ సంతోషాలతో ఉండే విధంగా ప్రజలపై నీ చల్లని చూపు ఉండాలని ఆంజనేయస్వామిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వాములు పాల్గొన్నారు

# లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జయంతి ఉత్సవాలు ప్రారంభం

**కబురు న్యూస్, వర్గల్ మే 08,**
సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో ప్రసిద్ధి చెందిన నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జయంతి ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైనాయి విశ్వక్సేనారాధన స్వస్తి పుణ్యా వచనము రక్షాబంధనము కార్యక్రమాలు నిర్వహించడం



జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు జగన్నాథచార్యులు రామాచార్యులు వేద పండితులు నాగబాల కామేశ్వర శర్మ సిబ్బంది సుధాకర్ నరేందర్ గౌడ్ ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు

# లంచం తీసుకుంటు ఏసీబీ కి దొరికిన లైన్‌మెన్

**కబురు న్యూస్,హైదరాబాద్ మే8..**
హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లోని TGSPDCL- గోల్నాక సెక్షన్‌లోని లైన్‌మెన్ వి. శివ మల్లేష్, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ అందించడానికి అధికారిక అనుకూలంగా వ్యవహరించడానికి మరియు ఫిర్యాదుదారుడి పాత విద్యుత్ మీటర్‌లో గుర్తించిన అవకతవకలకు సంబంధించి ఎటువంటి



బలవంతపు చర్యలు తీసుకోకుండా ఉండటానికి పి. సంతోష్ అనే ప్రైవేట్ వ్యక్తి ద్వారా ఫిర్యాదుదారుడి నుండి రూ.50,000/- లంచం డిమాండ్ చేసి రూ.30,000/- తీసుకుంటున్నందుకు తెలంగాణ ACB అధికారుల చేతికి చిక్కారు.

# పాక్ జాతీయులకు తాలిబాన్ వార్నింగ్

**కబురు న్యూస్, పాకిస్థాన్ మే8..**
భారత్-పాక్ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో దాయాది దేశంలోని పాష్తూన్ తెగ వారికి తాలిబాన్ సీనియర్ నేత, మాజీ రాయబారి ముల్లా అబ్దుల్ సలామ్ జయీఫ్ కీలక హెచ్చరికలు చేశారు. ఈ ఉద్రిక్తతల్లో జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. పాక్ ఆర్మీ ఆడే ఆటలో పావుగా మారొద్దని పాష్తూన్ తెగలను ఎక్స్ వేదికగా



ఆయన హెచ్చరించారు. జీహాద్ పేరిట పాక్ ఆర్మీ పాష్తూన్లను భారత్పైకి ఉసిగొల్పే

# 'ఆపరేషన్ సిందూర్'పై వ్యాఖ్యలు..
# పాక్ నటీనటులపై బ్యాన్!

కబురు సినిమా మే 08:
భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పాకిస్థానీ నటీనటులు ఫవాద్ ఖాన్, మహిరా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆల్ ఇండియా సినీ వర్కర్స్ అసోసియేషన్ ఖండించింది. వారిని తక్షణమే చిత్ర పరిశ్రమ నుంచి బహిష్కరించాలని పిలుపునిచ్చింది. కళల పేరుతో ఇలాంటివారికి గుడ్డిగా మద్దతు ఇవ్వొద్దని చిత్ర పరిశ్రమను అసోసియేషన్ కోరింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది."వారి కామెంట్స్ మన దేశాన్ని అగౌరవపరచేలా ఉండడం మాత్రమే కాదు.. ఉగ్రవాదం కారణంగా ప్రాణాలు కోల్పోయిన అమాయకులను, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులను కూడా అవమానించేలా ఉన్నాయి. మన చిత్ర పరిశ్రమలో వర్క్ చేసే పాకిస్థానీ కళాకారులు, చిత్రనిర్మాతలపై పూర్తిగా బ్యాన్ విధించాలి. భారతీయులెవరూ వీరిని అభిమానించొద్దు. కళ పేరుతో ఇలాంటి కళాకారులకు గుడ్డిగా మద్దతు ఇవ్వడం జాతీయ గౌరవాన్ని అగౌరవపరచడమేనని



చిత్ర పరిశ్రమ అర్థం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశం కోసం ఐక్యంగా నిలబడదాం" భారతీయ గాయనీగాయకులు పాక్ సింగర్స్‌తో వేదికలను పంచుకోవద్దని సూచించింది. జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది గత నెల ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం రాత్రి క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో విరుచుకుపడింది. 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసి 100 మంది ఉగ్రవాదులను హతమార్చింది.



## నా మహాభారతంలో నేనే కృష్ణుడిని
## మనసులో మాట వెల్లడించిన అమిర్ ఖాన్

కబురు సినిమా మే 08:
– మహాభారంతం కల నెరవేర్చే క్రమంలో బాలీవుడ్ నటుడు అమిర్ ఖాన్ ఒక్కో విషయం వెల్లడిస్తున్నాడు.అతిపెద్ద పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయిన మహాభారతంపై ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్ తన డ్రీమ్ అని అమిర్ ఖాన్ ఇప్పటికే చాలా సార్లు ప్రకటించారు. ఇక తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి మరోసారి స్పందించారు అమిర్ ఖాన్. 'ఈ సినిమాను ఈ ఏడాదిలోనే ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఇందులో నాకు కృష్ణుడి పాత్ర చేయాలని ఉంది. ఆ పాత్ర నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఒక పాత్రలో ఇన్ని రకాల వేరియేషన్స్ ఉంటాయా అనిపించేలా ఉంటుంది కృష్ణుడి పాత్ర. ఆ పాత్రలో నటించడం చాలా కష్టం. అందులో ఉండే అన్ని షేడ్స్ విభిన్నంగా ఉంటాయి. అందుకే ఆ పాత్ర చేయాలని ఉందని తెలిపారు. ఈ మహాభారతంను ఒక మూవీలో చూపించలేం. దాన్ని కొన్ని భాగాలుగా చూపించొచ్చు. ఆ మూవీ స్క్రిప్ట్ కోసమే కొన్నేళ్ల టైమ్ పడుతుంది. త్వరలోనే అది నెరవేరుతుందని ఆశిస్తున్నాను. ప్రస్తుతం సినిమాల పరంగా కొంత స్పీడ్ తగ్గింది. కానీ నా సినిమాల కోసం ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్ని తీసుకుంటున్నాను. నా సినిమాల్లో నేను లాభాల్లో షేర్ తీసుకుంటాను. హిట్ అయితే మాత్రమే ఈ షేర్ తీసుకుంటా. ఒకవేళ ఫ్లాప్ అయితే ఒక్క రూపాయి కూడా తీసుకోను. ఎందుకంటే సినిమా నష్టాల్లో కూడా నేను బాధ్యత తీసుకోవాలి అనుకుంటాను' అంటూ చెప్పుకొచ్చాడు అమిర్ ఖాన్. మొత్తంగా మహాభారతం ఎలా తీస్తారన్న ఆసక్తి నెలకొంది.




## హరిహరవీరమల్లు షూటింగ్ పూర్తి
## జూన్ 12న విడుదలకు డేట్ ఫిక్స్

కబురు సినిమా మే 08:
పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌కి బిగ్ అప్‌డేట్ వచ్చింది. హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ ఫైనల్‌గా కంప్లీట్ అయిపోయింది. ఎన్నో అవాంతరాల తర్వాత ఈ మూవీ రిలీజ్ డేట్ గురించి క్లారిటీ- వచ్చేసింది. మొదట మే 9 అని అధికారికంగా అనౌన్స్ చేసినా, షూటింగ్ జస్ట్ రెండు మూడు రోజుల క్రితమే ముగిసింది కాబట్టి, అంత తొందరగా రిలీజ్ చేయడం కాస్త కష్టమే. ఇప్పుడు తాజా బజ్ ఏంటంటే, ఈ సినిమా జూన్ 12న థియేటర్స్‌లో సందడి చేయబోతోంది! ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేస్తూ లీడింగ్ టికెట్ సెల్లింగ్ ఎ÷-లాట్‌ఫాం బుక్ మై షో జూన్ 12 డేట్‌తో 'కమింగ్ సూన్' అంటూ ఫైర్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేసింది. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఇప్పటికే హైప్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యి దాదాపు నాలుగేళ్లు అవుతోంది. 2020లో అనౌన్స్ అయిన హరిహర వీరమల్లు షూటింగ్‌లో కోవిడ్ పాండమిక్, పవన్ కళ్యాణ్ రాజకీయ కమిట్‌మెంట్స్ వల్ల బోలెడు డిలేస్ ఫేస్ చేసింది. ఆయన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ-సీఎంగా బిజీగా ఉండటంతో షూటింగ్ కాస్త స్లో అయింది. అయినా, 2024 సెప్టెంబర్‌లో విజయవాడలో సెట్‌లో షూటింగ్ రీస్టార్ట్ అయ్యి, మే 6, 2025 నాటికి ఫైనల్‌గా ర్యాప్ అయిపోయింది. ఇప్పుడు పోస్ట్-ప్రొడక్షన్, ÷ఎఎ÷, డబ్బింగ్ వర్క్ ఫుల్ స్పీడ్‌లో జరుగుతోంది. పవన్ కళ్యాణ్ -టైటిల్ రోల్‌లో వీరమల్లుగా కనిపించబోతున్నాడు. బాబీ డియోల్ మొగల్ బాద్‌షా ఔరంగజేబ్‌గా విలన్ రోల్‌లో కనిపిస్తారు. నిధి అగర్వాల్ లీడ్ హీరోయిన్‌గా, అనుపమ్ ఖేర్, నర్గిస్ ఫక్రీ, నోరా ఫతేహి లాంటి స్టార్ కాస్ట్ ఈ మూవీలో ఉన్నారు. డైరెక్షన్ క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ కాంబోలో జరిగింది. సినిమాకి ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్ ఇచ్చారు, ఇప్పటికే 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో' సాంగ్స్ రిలీజ్ అయి ట్రెడ్ అయ్యాయి.

# పిల్లలను కనడం... ఓ పెద్ద టాస్క్




కబురు సినిమా మే 08:
బాలీవుడ్‌లో తమదైన నటతో స్టార్స్‌గా ఎదిగారు దీపికా పదుకుణె-రణ్‌వీర్ సింగ్. సినిమా పరిశ్రమలో ఈ జంట తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటికీ బాలీవుడ్ లో భారీ రెమ్యూనరేషన్ తీసుకునే టాప్ స్టార్లలో వీరిద్దరూ ఉంటారు. ఇక మూడుముళ్ల బంధంతో ఒక్క-టైన ఈ జంట తమ ఆరేళ్ల వైవాహిక బంధానికి ప్రతీకగా, ఈ ఏడాది సెప్టెంబర్ లో పండంటి ఆడబిడ్డని తమ జీవితంలోకి ఆహ్వానించారు. దీంతో ఈ బాలీవుడ్ లవ్లీ కపుల్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నా అంటూనే దీపికా తిరిగి తన కెరీర్ ను మొదలు పెట్టింది. ఒప్పుకున్న సినిమాలు కంప్లీట్ చేసే పనిలో పడింది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ దీపిక రణ్ వీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. దీపిక మాట్లాడుతూ.. 'పెళ్లయిన కొత్తలో ఓ సారి పిల్లలను కనడం గురించి రణ్‌వీర్ తో మాట్లాడుతూ.. ఎప్పుడు ప్లాన్ చేద్దాం అని అడిగాను. దానికి ఆయన సమాధానం ఇస్తూ.. పిల్లలను కనడం ఇద్దరి నిర్ణయం అయినప్పటికీ.. మోయాల్సింది నువ్వు మాత్రమే. బేబీ నీ శరీరంలోనే పెరుగుతుంది. కాబట్టి నువ్వే నిర్ణయం తీసుకోవాలి. పిల్లలను కనగలను అని నీకు ఎప్పుడు అనిపిస్తే అప్పుడు ప్లాన్ చేద్దాం అన్నారు. ఆయన మాటలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి' అని దీపికా చెప్పుకొచ్చింది.



## ఇట్స్ న్యూ బిగినింగ్..సమంత
# ఆసక్తికర పోస్ట్

కబురు సినిమా మే 08:
ఏమాయ చేసావేతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన సమంత ఆ సినిమా సూపర్ హిట్ తో బ్యాక్ టు- బ్యాక్ సినిమాలతో స్టార్ హీరోయిన్ గా మారింది. ఆ దశలోనే అక్కినేని వారి వారసుడు నాగచైతన్య తో ప్రేమాయణం, పెళ్లి.. విడాకులు ఇలా అన్ని చకచకా జరిగిపోయాయి. చైతు నుండి విడాకులు తీసుకున్నాక టాలీవుడ్‌కు దూరంగా ఉంటూ వస్తోంది సమంత. అదే టైమ్ లో బాలీవుడ్ లో ఫ్యామిలీ మెన్ సిరీస్ తో సూపర్ హిట్ అందుకుంది. ఈ సిరిస్ తో ప్రశంసలతో పాటు- ఆ సిరిస్ దర్శకులలో ఒకరైన రాజ్ నిడమోరుతో ప్రేమలో పడిందనే ఆరోపణలు ఎదుర్కొంది సమంతా. రాజ్.. సమంతలు రిలేషన్ లో ఉన్నారనే టాక్ నడిచింది. ఓ వైపు సామ్ మొదటి భర్త నాగ చైతన్య మరో పెళ్లి చేసుకోవడంతో సమంత కూడా పెళ్లి పీటలు ఎక్కబోతుందని వార్తలు హల్ చల్ చేసాయి. కానీ అవన్నీ గాసిప్ లాగే మిగిలాయి. కానీ ఇప్పుడు లేటె-స్ట్ గా సమంత ' ఇది చాలా కష్టమైన ప్రయాణం. కానీ ఇక్కడి వరకూ చేరుకున్నాం. ఇట్స్ న్యూ బిగినింగ్ ' అని పోస్ట్ చేస్తూ దర్శకుడు రాజ్ నిడిమోరుతో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక సమంత నిర్మించిన శుభం మే 9న విడుదల కానుంది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించాడు. ఈయన డైరెక్ట్ చేసిన తొలిసినిమా 'సినిమా బండి' కి రాజ్ నిడిమోరు నిర్మాతగా వ్యహరించగా రెండవ సినిమాను సమంత నిర్మించడం కొసమెరుపు. ఇంతకీ సమంత చెప్పిన ఆ న్యూ బిగినింగ్ లోగుట్టు ఏమిటో వేచి చూడాల్సిందే.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com